సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ၊ 10 ၊ జనవరి ၊ 2023



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టంగా రూ.3, సరాసరి రూ.5.50 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/8.7°
జిల్లాలో సోమవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉన్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సత్యసాయి సేవలో సోనూనిగమ్




సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న సోనూనిగమ్

ప్రశాంతి నిలయం: బాలీవుడ్ స్టార్ సింగర్ సోనూ నిగమ్ సోమవారం సత్యసాయి సేవలో గడిపారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రశాంతి నిలయం చేరుకున్న ఆయనకు, సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. అనంతరం సోనూనిగమ్ తన బృందంతో కలిసి సాయికుల్వంత్ సభా మందిరం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

'అనంత' గజగజ

- సీజన్‌లో తొలిసారి ఉష్ణోగ్రతలు పతనం



యల్లనూరులో కప్పేసిన పొగ మంచు

అనంతపురం అగ్రికల్చర్: శీతాకాలంలో తొలిసారి ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయిలో నమోదవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు గజగజ వణుకుతున్నారు. రాత్రిళ్లు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తగ్గిపోవడంతో చలితీవ్రత బాగా పెరిగింది. సోమవారం వేకువజామున పొగమంచుతో పాటు చలి ఎక్కువైంది. మధ్యాహ్నం 12 గంటల వరకు చలితీవ్రత కొనసాగింది. అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.4 డిగ్రీలు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 8.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక శెట్టూరు 8.8, తనకల్లు 9, నల్లచెరువు 9.3, గుమ్మఘట్ట, సోమందేపల్లి 9.6, గాండ్లపెంట, కంబదూరు, అమడగూరు 9.7, అగళి 9.8, పుట్లూరు, ఉరవకొండ 9.9 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. శింగనమల, యల్లనూరు, పెద్దవడుగూరు, పామిడి, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, గుత్తి, గుంతకల్లు, విడపనకల్లు, వజ్రకరూరు, ఆత్మకూరు, కూడేరు, యాడికి, ఓడీ చెరువు, రొద్దం, రామగిరి, తాడిమర్రి తదితర మండలాల్లో కూడా ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడటం, కోటా మేరకు హెచ్చెల్సీ, హంద్రీ–నీవా నీళ్లు రావడంతో జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులన్నీ జలకళను సంతరించుకోవడంతో చలి వాతావరణం పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.

పదిపై 'ప్రత్యేక' శ్రద్ధ

- పదో తరగతిలో వందశాతం ఫలితాలపై ప్రభుత్వం దృష్టి
- వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కదిరి వేమన ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

559	జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు
25,963	పరీక్షలు రాయనున్న విద్యార్థుల సంఖ్య

కదిరి: పదో తరగతి పరీక్షలంటే అటు విద్యార్థులకు...ఇటు తల్లిదండ్రులకూ టెన్షనే. ప్రైవేటు, కార్పొరేట్ పిల్లలకైతే వారి తల్లిదండ్రులు ఇంటి దగ్గర ట్యూషన్ చెప్పిస్తారు. లేదా పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తారు. వారి సందేహాలు నివృత్తి చేస్తారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు చాలా మందికి అంత ఆర్థిక స్తోమత ఉండదు. ఉన్నా సాయంత్రం వేళ టీచర్లు అందుబాటులో ఉండరు. దీంతో చాలామంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటేనే భయపడిపోతారు. దీని ప్రభావం ఫలితాలపైనా చూపుతోంది. దీన్ని గుర్తించిన వైఎస్ జగన్ సర్కార్ ఫలితాలు మెరుగుపడేలా 'ప్రత్యేక' చర్యలు చేపట్టింది. 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి..
ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కారు పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా చదువుల్లో వెనుక బడిన టెన్త్ విద్యార్థుల కోసం పాఠశాల ప్రాంగణంలోనే రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. వంద శాతం ఫలితాలే సాధనగా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులపై కలెక్టర్ బసంత్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఎప్పటికప్పుడు ఆయా మండలాల ఎంఈఓలతో సమీక్షలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవపై టీచర్లతో పాటు విద్యార్థులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇలా...
10వ తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఈ మధ్యే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సీబీఎస్‌ఈ తరహాలోనే రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3న ఫస్ట్ లాంగ్వేజ్, 6వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, 8న ఇంగ్లిష్, 10వ తేదీన గణితం, 13న సైన్స్, 15వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి. అలాగే ఏప్రిల్ 17న కాంపోజిట్ కోర్సు, 18న ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది.

ఈసారి ఆరు పేపర్లే..
విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 11 పేపర్లకు బదులు 6 పేపర్లే ఉండేలా నిర్ణయం తీసుకుంది. కరోనా తీవ్రత నేపథ్యంలో 2019–20 అలాగే 2020–21 విద్యాసంవత్సరాల్లో పది పబ్లిక్ పరీక్షలు నిర్వహించ లేదు. సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకొని టెన్త్ మార్కులు నిర్ణయించారు. గత ఏడాది కూడా 7 పేపర్లతోనే పరీక్షలు నిర్వహించారు. ఈసారి సీబీఎస్‌ఈ తరహాలోనే టెన్త్‌లో ఆరు పేపర్లే ఉంటాయి.

సహకారం బాగుంది



ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నాం. టీచర్లు, విద్యార్థులతో పాటు పిల్లల తల్లిదండ్రుల సహకారం కూడా బాగుంది. ఈ ఏడాది 22,513 రెగ్యులర్, 3,424 మంది ప్రైవేటు విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. చదువులో వెనుక బడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు బాగా ఉపయోగ పడుతున్నాయి. ఈసారి మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.
– మీనాక్షి, ఇన్‌చార్జ్ డీఈఓ

మంచి నిర్ణయం



చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలిస్తోంది. సబెక్టు టీచర్లందరూ ప్రత్యేక తరగతులకు హాజరై విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ఫలితంగా వంద శాతం ఉత్తీర్ణత వస్తుందని భావిస్తున్నాం.
– హరినాథ్‌రెడ్డి, తెలుగు పండిట్, వేమన ప్రభుత్వ పాఠశాల, కదిరి

పరీక్షలపై భయం పోయింది



ప్రత్యేక తరగతుల నిర్వహించడంతో పరీక్షలపై భయం పోయింది. రోజూ టీచర్లు చదివిస్తూ అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయమే ముందురోజు చదివిన వాటిపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అందుకే చాలా ఈజీగా ఉంది. ప్రత్యేక తరగతుల వల్ల ప్రతి ఒక్కరూ పాస్ అవుతారన్న నమ్మకం కల్గుతోంది.
– సుఫియాన్, పదో తరగతి విద్యార్థి, వేమన ప్రభుత్వ పాఠశాల, కదిరి

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 26న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ బసంత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గణతంత్ర వేడుకల నిర్వహణపై ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేడుకల్లో జాతీయ పతాక ఆవిష్కరణ, స్టాళ్ల ఏర్పాటు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అన్ని శాఖలు పాలుపంచుకోవాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు జాతీయ పతకావిష్కరణ, స్టేజ్ ఏర్పాట్లు చూడాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రగతి ప్రతిబింబించేలా శకటాలు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రగతి నివేదికలను అన్ని శాఖల అధికారులు ఈనెల 13వ తేదీలోపు అందజేయాలన్నారు. ఆహుతులను ఆకట్టుకునేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించే ఏర్పాట్లు చేయాలని డీఈఓను ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో పారిశుధ్యం, తాగు నీరు పనుల బాధ్యతను మున్సిపల్ కమిషనర్ తీసుకోవాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ విజయకుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ డీఈ మరళీమోహన్, డీఈఓ మీనాక్షి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు రేపు ఇంటర్వ్యూలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 110 అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో భాగంగా...ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 213 మంది అభ్యర్థులకు ఈనెల 11వ తేదీ(బుధవారం) ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీ కుమారి తెలిపారు. కదిరి ఆర్డీఓ కార్యాలయం, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయాల్లో ఆయా డివిజన్ల వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఇప్పటికే అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపామన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పంపిన అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్ వెంట తీసుకురావాలన్నారు.

రేపు విద్యార్థులకు పోటీలు

కొత్తచెరువు: ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంత్యుత్సవాల సందర్భంగా ఈ నెల 11న విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పద్యగానంపై జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. పోటీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

బాబుచేతిలో పావు పవన్‌కల్యాణ్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: సింగిల్‌గా ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేని చంద్రబాబు... ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌ను పావుగా వాడుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. సోమవారం ఆయన సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ప్రజా సంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డుపడుతూ, శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ–1 పై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. తమ ప్రచారం కోసం చంద్రబాబు కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురి ప్రాణాలను బలిగొన్నారన్నారు. ప్రశ్నించేందుకు రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే పవన్‌కల్యాణ్... ఈ రెండు ఘటనల్లోని బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించ లేదని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చి చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చారని, ఇప్పుడు మళ్లీ 2024 ఎన్నికల్లో బాబుకు లబ్ధి కల్పించడానికి తహతహ లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, మైనార్టీ సెల్ కన్వీనర్ ఇమాం వలీ, మండల ప్రచార కార్యదర్శి నరసింహ మూర్తి, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సర్పంచ్ అంజి నాయక్, కేజీబీవీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామాంజి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరిస్తున్నారు

- పోలీసులను ఆశ్రయించిన దంపతులు
- 'పోలీసు స్పందన'కు 36 వినతులు



వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: 'తాతల కాలం నుంచి సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిపై మాకు హక్కులేదని, పొలంలో కాలు పెడితే చంపుతామంటూ కొందరు బెదిరిస్తున్నారు' అని రొద్దం మండలం కొగిర గ్రామానికి చెందిన గంగమ్మ, అంజినప్ప దంపతులు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. కొగిర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 79లోని 4.7 ఎకరాల భూమిని తమ తాతల కాలం నుంచి సాగు చేస్తున్నట్లు వివరించారు. దీనికి సంబంధించి సాగు అనుమతులను స్థానిక తహసీల్దార్ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ భూమిని గ్రామానికి చెందిన గంగాద్రి దాక్షయణి, నర్సమ్మ, మారెక్క, అంజినప్ప, నరసింహులు తదితరులు తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన ఎస్పీ... సమస్య పరిష్కరించాలంటూ రొద్దం పోలీసులను ఆదేశించారు. కాగా, సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 51 వినతులు అందాయి. స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించి, న్యాయం చేయాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకుబాట.. భవిత రాత

పుట్టే ప్రతి బిడ్డా చేతులు బిగబట్టే పుడుతుంది
ఆ చేతుల్లో పుస్తకం పెడితే తలరాతనే మార్చుకుంటుంది
విధిరాతకు తలొగ్గితే.. అలాగే మిగిలిపోతుంది



ఈ చిత్రం ఓ ఆదర్శమూర్తి పట్టుదలకు, ఓ చిన్నారి సంకల్పానికి అద్దం పడుతోంది. అనంతపురం శివారులోని బీజేపీ కొట్టాలకు చెందిన మారెమ్మ రోజా తడకలేరు సమీపంలోని ఫుట్‌పాత్‌పై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. తన ఒక్కగానొక్క బిడ్డ తనలా ఉండిపోకూడదని అనంతపురం పాతూరు ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదివిస్తోంది. చిన్నారి కూడా బడి వదలగానే తల్లి వద్దకు వచ్చి ఫుట్‌పాత్‌పైనే హోం వర్క్‌లు చేసుకుంటోంది. రోడ్డు పక్కనే ఎదుగుతున్న చదువుల మొక్కను. ఆ మొక్కకు తీగలా మారిన తల్లి చెట్టునూ చూసి వాహనదారులు సలామ్ చేస్తున్నారు.

– జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్

కొంపముంచిన 'రెట్టింపు రాబడి' ఆశ

రూ.30 లక్షలు మోసపోయిన యువకుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెట్టుబడికి రెండింతల రాబడి అంటూ సామాజిక మాధ్యమం టెలిగ్రాంలో వచ్చిన 'ఆఫర్'ను నమ్మి ఓ యువకుడు నయవంచనకు గురయ్యాడు. రూ.30 లక్షల దాకా పెట్టుబడి రూపంలో పెట్టి మోసపోయాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. అనంతపురంలోని కోవూరునగర్‌లో నివాసముంటున్న ఎరుకల రాజశేఖర్ ఇటీవల స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న టెలిగ్రామ్ యాప్‌లో ఓ ప్రకటన చూశాడు. ఇంటి వద్దే ఉండి రోజుకు రూ.1000 నుంచి రూ.1,500 వరకు సంపాదించవచ్చు అని ఉండటంతో ఆసక్తి చూపాడు. ఆ యాప్ సూచనలను అనుసరించాడు. సినిమాలకు రేటింగ్ ఇవ్వాలని, ఇందుకు గాను డ్రాఫ్ట్ హౌస్ వెబ్‌సైట్ తెరవాలని సూచించడంతో ఆ విధంగానే చేశాడు. కమీషన్ కోసం ఎదురు చూశాడు. ఇతని ఫోన్ నంబర్ ద్వారా ఒక ఐడీ (107902) సృష్టించారు. ఈ ఐడీతో 30 పనులు పూర్తి చేసిన అనంతరం రాజశేఖర్‌కు రూ.850 కమీషన్ వచ్చింది. అనంతరం డిపాజిట్‌లు చేయాలని చెప్పడంతో ఈ నెల మూడో తేదీ నుంచి పలు దఫాలుగా యాప్ నిర్వాహకులు చెప్పిన ఐదు ఖాతాలకు మొత్తం రూ.29.80 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం యాప్‌లో ఎవరూ అందుబాటులోకి రాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన రాజశేఖర్.. ఈ నెల ఎనిమిదో తేదీన నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జాకీర్‌హుస్సేన్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు.

అగ్రస్థానంలో నిలబడదాం

- స్పందన అర్జీల పరిష్కారంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుద్దాం
- అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ సూచన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: 'గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా అధికారులందరం చిత్తశుద్ధితో పనిచేద్దాం. స్పందన అర్జీలకు సకాలంలో మెరుగైన పరిష్కారం చూపుదాం. మనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేద్దాం. అర్జీల పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచి అందరికీ ఆదర్శంగా ఉందాం' అని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తంగా 127 అర్జీలు అందగా, ప్రతి అర్జీదారుని సమస్యనూ ఓపికగా వింటూ భరోసా ఇచ్చారు. కొన్నింటిపై అప్పటికప్పుడే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి..
స్పందనలో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. స్పందన కార్యక్రమం అనంతరం కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అర్జీల పరిష్కారంలోనూ అలసత్వ ధోరణి చూపరాదన్నారు. పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని అర్జీదారులకు తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. చాలా సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని, కానీ ఈ విషయం తెలియక ప్రజలు వ్యయప్రయాలసకోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్నారన్నారు. దీనిపై ప్రజలకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించిన వెంటనే ఫొటో తీసి నవశకం పోర్టల్లో అప్లోడ్ చేయాలన్నారు. అలాచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాటు పలుశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీలు కొన్ని
- కదిరి మండలం పట్నం గ్రామ పొలం సర్వే నంబర్‌లో 169లో తాము 4.77 ఎకరాలను కొనుగోలు చేశానని, తన భర్త మరణించడంతో ఆ భూమిని తనపేరున మార్చాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తలుపుల మండలం గొల్లపల్లికి చెందిన బీబీజాన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా తనకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు.
- తాను చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయలంలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేశానని, 60 ఏళ్ల వయసు వచ్చిందని పని నుంచి తొలగించారని, కానీ బకాయిగా ఉన్న మూడునెలల జీతం ఇవ్వడం లేదని ఆదిమూర్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే తనకు బకాయి వేతనం ఇప్పించాలని కోరారు.
- తనకు స్వగ్రామంలో 2 ఎకరాల పొలం ఉండగా, తమ గ్రామానికే చెందిన నాగరాజు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని, పోలీసులు, రెవిన్యూ సిబ్బంది రికార్డులు తనిఖీ చేసి ఆ భూమి తమదేనని చెప్పినా వినిపించుకోకుండా దౌర్జన్యం చేస్తున్నాడని అమరాపురం మండలం, శిరవం గ్రామానికి చెందిన కదిరెప్ప కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి
జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పురోగతి సాధించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన స్పందన అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని శాఖల అధికారులతో హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత, ఉపాధిహామీ, స్పందన అర్జీల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు ప్రభుత్వం 10,750 ఇళ్లు కేటాయించిందని, ఉగాదిలోపు వాటన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారుకు కావలసిన స్టీల్, సిమెంట్ అందజేయాలన్నారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని ఉపాధి కూలీలకు 79 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం విధించగా, ఇప్పటి వరకూ 66 లక్షల పని దినాలే కల్పించారని, నెలాఖరుకు మిగిలిన పనిదినాలు కల్పించాలన్నారు. అలాగే 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించిన పనుల వేగవంతం చేయాలన్నారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న ఏపీ సేవా సర్వీసులను ప్రజలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. మల్టీపర్పస్ గోడౌన్లకు భూసేకరణ పూర్తి చేయాలన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



విజేతలను ఎంపిక చేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, అజిత వేజెండ్ల దంపతులు, మొదటి బహుమతి అందుకుంటున్న జ్యోతి, రెండో బహుమతి అందుకుంటున్న రేణుకాబాయి, మూడో బహుమతి అందుకుంటున్న అరుణ

- పోటీల్లో పాల్గొన్న పోలీసు కుటుంబాలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్పీ దంపతులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు కుటుంబాల మధ్య నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. శిరసాని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో 35 మంది తలపడ్డారు. న్యాయనిర్ణేతలుగా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, ఆయన సతీమణి, 14వ బెటాలియన్ కమాండెంట్ అజిత వేజెండ్ల వ్యవహరించారు. పోటీలో తొలి మూడు బహుమతులను వరుసగా జ్యోతి, రేణుకాబాయి, అరుణ అందుకున్నారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, సీఐలు జయానాయక్, రవీంద్రారెడ్డి, ఏఆర్ అడ్మిన్ టైటాస్, హోంగార్డ్ ఆర్ఐ శ్రీశైలం రెడ్డి, ఎంటీఓ నారాయణ, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు టిప్పర్లు ఢీ



డ్రైవర్ నాగరాజును అంబులెన్స్‌లోకి తరలిస్తున్న స్థానికులు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై రెండు టిప్పర్లు ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలో సోమవారం ఇసుక ఆన్‌లోడ్ చేసిన రెండు టిప్పర్లు తిరిగి ముదిగుబ్బ మండలంలోని రాళ్ల అనంతపురం ఇసుక రీచ్‌కు బయలుదేరాయి. మార్గమధ్యంలో బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్యం వద్ద ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొంది. ఘటనలో వెనుక ఉన్న టిప్పర్ డ్రైవర్ నాగరాజు (బత్తలపల్లి మండలం, సూర్యచంద్రాపురం గ్రామం) వాహనంలోనే ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు నాగరాజును కాపాడేందుకు ప్రయత్నించారు. పోలీసులు జేసీబీని రప్పించి క్షతగాత్రుడిని వెలికి తీసి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి గురైన రెండు టిప్పర్ల యజమాని ఒక్కరే కావడంతో పోలీసు కేసు లేకుండా రాజీ చేసుకున్నట్లు సమాచారం.

మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుత్తిరోడ్డు సమీపంలో మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,11,910 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిలో రామచంద్ర, రామాంజినేయులు, రాణీ నగర్ నివాసి వెంకట్రాముడు అలియాస్ కోడి ఉన్నారు.

అనంతలో మళ్లీ దొంగలు పడ్డారు!

- తొమ్మిది రోజుల వ్యవధిలోనే మరో చోరీ
- నగదుతో పాటు ఆధునాతన కారు అపహరణ



దుండగులు అపహరించుకెళ్లిన కారు (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గత ఏడాది డిసెంబర్ 31న అనంతపురంలోని బళ్లారి బైపాస్ వద్ద ఉన్న కారు డెకర్స్ దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లిన ఘటన మరువక ముందే నగరంలో మళ్లీ దొంగలు పడ్డారు. గతంలో చోరీకి పాల్పడిన ప్రాంతంలోనే మరో దుకాణంలో చొరబడి నగదుతో పాటు ఆధునాతన కారును అపహరించుకెళ్లారు. వివరాలు... నగరంలోని తపోవనం సమీపంలో 44వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై వీల్ అలైన్‌మెంట్ దుకాణంలోకి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ప్రవేశించారు. దుకాణం షట్టర్‌ను బలమైన రాడ్‌తో మెండి లోపలకు ప్రవేశించినట్లుగా తెలుస్తోంది. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌లు, క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.39వేలు తీసుకున్నారు. అనంతరం లాకర్‌లో దొరికిన కొన్ని కార్ల తాళాలు తీసుకుని దుకాణం వెనుక ఆవరణలోకి ప్రవేశించి ఏపీ39 ఎన్ఎం 9844 నంబర్‌గల షిఫ్ట్ డిజైర్ కారును అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని యజమాని రమేష్ గుర్తించి, సమాచారం అందించడంతో మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. సమీపంలోని పలు దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సహకారశాఖ డైరీ ఆవిష్కరణ



నూతన డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, అధికారులు

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన డైరీ– 2023ను కలెక్టర్ బసంత్‌కుమార్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీసీఓ కృష్ణానాయక్, డీఎల్‌పీఓ రామచంద్ర, ఆడిట్ అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: వైఎస్సార్ టీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మీనాక్షి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యారంగాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, రమణారెడ్డి మాట్లాడుతూ... విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి సమూల మార్పులు చేశారన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను కల్పించారన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీలు రామకృష్ణ, నాగరాజు, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కేశవరెడ్డి, నారాయణస్వామి, విజయకుమార్ నాయక్, ప్రకాష్‌రెడ్డి, సాయినాథరెడ్డి, సురేంద్ర రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు, శివారెడ్డి, శంకర్, రామిరెడ్డి, రాజగోపాల్, జనార్ధన రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, సునీత, సుజాత, అనిత, సాయిలీల, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



పోషకాల కిట్లను అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పోషకాలు కలిగిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని టీబీ వ్యాధిగ్రస్తులకు కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగంగా టీబీతో బాధపడుతున్న వారికి పోషకాలు కలిగిన కిట్లను సోమవారం కలెక్టర్ అందజేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ఈ క్రమంలో రూ. కోట్లను వెచ్చిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, సిబ్బంది హబీబ్‌బాషా, రవికుమార్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, దేవేంద్ర, నాగమణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పాల్గొనే జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టును సోమవారం ఎంపిక చేశారు. అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన ఈ ప్రక్రియకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో రోషిత, మల్లీశ్వరి, షాహీన్, రాధిక, నూర్జహన్, శ్రావణి, మీనేటీ, మమత, జ్యోతి, ఎం శ్రావణి, పావని, మాధవి, దీపిక, ఆశ ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

విద్యార్థులను దీటుగా తీర్చిదిద్దండి

- సృజనాత్మక బోధనతోనే సులువుగా అభ్యసనం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



ఎస్కేయూలో అధ్యాపకుల శిక్షణను ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అనంతపురం: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో '21 వ శతాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులు' అనే అంశంపై అధ్యాపకులకు నాలుగు రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి హేమచంద్రారెడ్డి మాట్లాడారు. పారిశ్రామిక విప్లవం 4.0కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు. ఉన్నత విద్యలో ప్రమాణాల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా ఖర్చు చేస్తోందన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఏటా రూ.20 వేలు జగనన్న వసతి దీవెన కింద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక స్కిల్ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తున్నామన్నారు. సంప్రదాయ విధానంలో డిగ్రీ చదివే విధానానికి స్వస్తిపలికి డిగ్రీ ఆనర్స్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌ను తప్పనిసరి చేశామన్నారు. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తేనే కొలువులు దక్కుతాయన్నారు. కళాశాల నుంచే కంపెనీ కొలువులు దక్కేలా నూతన విద్యాప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. నూతన జాతీయ విద్యావిధానం -2020 అమల్లోకి రాక ముందే మన రాష్ట్రంలో అమలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రిసోర్స్‌పర్సన్ ఎస్.దినకర్‌రెడ్డి, రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎల్.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ డి.చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యాల మెరుగు..

అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అకాడమీ సహకారంతో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయడం ద్వారా వారిలో ఉద్యోగ నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎ.శేషారెడ్డి, కామర్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో పురుగు మందుల పిచికారీ సులభతరం

- డెమోలో శాస్త్రవేత్తలు, అధికారులు



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

నల్లమాడ: డ్రోన్ యంత్రాల సాయంతో పంటలకు పురుగు మందుల పిచికారీ మరింత సులభతరమవుతుందని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. డ్రోన్ వినియోగంపై నల్లమాడ మండలం ఎద్దులవాండ్లపల్లి తండా రైతులకు సోమవారం వారు అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. 40 శాతం సబ్సిడీతో రైతు సంఘాలకు ప్రభుత్వం డ్రోన్‌లు అందజేస్తోందన్నారు. మండలానికి మూడు డ్రోన్ యంత్రాలు అందించేందుకు రైతు సంఘాల ఏర్పాటుకు అనుమతులు వచ్చినట్లు వివరించారు. ఈ క్రమంలో ఉత్సాహవంతులైన యువ రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డ్రోన్ పైలెట్‌గా శిక్షణ పొందడానికి పాసుపోర్టు కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. డ్రోన్‌లపై రైతులు అవగాహన కల్పించుకొని ఈ సాంకేతికతను సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి సూచించారు. కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం) డాక్టర్ వేమన మాట్లాడుతూ... డ్రోన్‌ల వినియోగంతో రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రోన్ సాయంతో 10 నిమిషాల్లోనే ఎకరా పంట పొలానికి పురుగు మందు పిచికారీ చేయవచ్చన్నారు. దీని వల్ల రైతులకు సమయం ఆదా కావడమే కాక, పిచికారీ ద్వారా వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రఘునాథరెడ్డి, కదిరి ఏడీఏ సత్యనారాయణ, ఏఓ సుమతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాస రెడ్డి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



ఓటును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి, ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు కొండారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ వన్నప్ప, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కళ్యాణదుర్గం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం వేదికగా రెండు రోజుల పాటు సాగిన రాష్ట్ర స్థాయి పోటీలకు 12 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. అండర్-19 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో 20 మంది, బాలికల జట్టులో 20 మంది చొప్పున చోటు దక్కించుకున్నారు. బాలుర జట్టుకు పీడీలు వీరేష్, వి.మురళి, జి.సురేష్, బాలికల జట్టుకు పీడీలు శివకేశవుడు, నాగమణి, శ్రీధర్‌రెడ్డి సెలెక్టర్లుగా వ్యవహరించారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టు పీపీగా లక్ష్మీనారాయణ



అనంతపురం: జిల్లా ఒకటవ అదనపు కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా వ్యవహరిస్తున్న గోపవరం లక్ష్మీనారాయణరెడ్డిని అదే కోర్టు పీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం పీపీగా వ్యవహరించిన దంపెట్ల రాజశేఖర గౌడ్ కాలపరిమితి ఈ నెల 6న ముగిసింది. దీంతో లక్ష్మీనారాయణరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణరెడ్డిని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హరినాథరెడ్డి, కసునూరు విద్యావతి, నాగరాజు బాబు, పూజారి రాజశేఖర్ యాదవ్, నరసింహారెడ్డి, సృజన, రమణారెడ్డి, న్యాయవాదులు అభినందించారు.

57 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 57 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆదేశాలతో సోమవారం అనంతపురం మండలం ఆకుతోటపల్లి వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ లారీతో మరో ఆటోను తనిఖీ చేయగా 57 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో వాహనాలను సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు, తరలింపుదారులను అదుపులోకి తీసుకుని ఇటుకలపల్లి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో అనంతపురంలోని లెనిన్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ డి.జయపాల్‌రెడ్డి, బియ్యం తరలింపుదారు శ్రీకాంత్, గార్లదిన్నె మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మినీ లారీ డ్రైవర్ డి.మల్లికార్జున, ఆటో యజమాని ఎస్.తరుణ్ తేజ్ ఉన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వి.వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలాపురంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ దాడులు

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామంలో విద్యుత్ చోరీలపై సోమవారం ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మొత్తం మూడు బృందాలుగా విడిపోయి చేపట్టిన తనిఖీల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న 27 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు.